18-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - సుగంధమయమైన పుష్పాలుగా అవ్వండి, శ్రీకృష్ణుడు నంబర్ వన్ సుగంధమయమైన పుష్పము, అందుకే వారు అందరికీ ఎంతో ప్రియమనిపిస్తారు, అందరూ వారిని తమ నయనాలపై పెట్టుకుంటారు"

ప్రశ్న:- లౌకికములో స్వీట్ (మధురమైన) సంబంధము ఏది మరియు స్వీటెస్ట్ (అత్యంత మధురమైనవారు) అని ఎవరిని అంటారు?

జవాబు:- లౌకికములో కూడా స్వీట్ (మధురమైనవారు) అని తండ్రినే అంటారు. పిల్లలైన మీరు కూడా - మా తండ్రి అతి ప్రియాతి ప్రియమైనవారు, మధురమైనవారు, మేము వారి ప్రియమైన పిల్లలము అని అంటారు. స్వీటెస్ట్ (అత్యంత మధురమైనవారు) అని టీచర్ ను అంటారు ఎందుకంటే టీచర్ చదువును చదివిస్తారు. జ్ఞానము సంపాదనకు ఆధారము. మీకు కూడా మొదట జ్ఞానము లభిస్తుంది. గృహస్థ వ్యవహారములో ఉంటూ ఈ జ్ఞానాన్ని ధారణ చేయాలి మరియు ఇతరుల చేత చేయించాలి.

పాట:- నీ దారిలోనే మరణించాలి... (మర్నా తేరీ గలీ మే...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. ఎవరైనా మరణించినప్పుడు వారు వేరే మాత, పితల వద్దకు వెళ్ళి జన్మ తీసుకుంటారు. ఆ తండ్రికి అభినందనలు చెప్పడం జరుగుతుంది. ఆత్మలమైన మనము అవినాశీ అని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. అక్కడ అది శరీరము యొక్క విషయము. ఒక శరీరాన్ని వదిలి ఇంకొకటి తీసుకుంటారు అనగా ఒక తండ్రిని వదిలి ఇంకొక తండ్రి వద్దకు వెళ్తారు. మీరు 84 మంది సాకార తండ్రులను పొందారు. వాస్తవానికి మీరు నిరాకారుడైన తండ్రికి పిల్లలు. ఆత్మలైన మీరు నివసించేది కూడా నిర్వాణధామము, శాంతిధామములో. అక్కడ తండ్రితోపాటు అందరూ నివసిస్తారు. దానిని ఆత్మల లోకము అని అంటారు. ఆత్మలైన మీరు కూడా అక్కడే ఉంటారు, అలాగే తండ్రి కూడా అక్కడే ఉంటారు. ఇక్కడ లౌకిక తండ్రికి పిల్లలుగా అవుతారు, కావున వారిని మర్చిపోతారు. సత్యయుగములోనైతే ఎవ్వరూ తండ్రిని స్మరించరు. బుద్ధి కిందకు వచ్చేస్తుంది. వారిని స్మృతి చేసినట్లయితే - ఓ బాబా అని అంటారు. వీరిని కూడా బాబా అని అంటారు. వీరు కూడా తండ్రియే. లౌకిక తండ్రిని ఇక్కడ చూస్తారు. పారలౌకిక తండ్రిని పిలిచినప్పుడు దృష్టి పైకి వెళ్తుంది. ఇప్పుడు మీరు ఆ బాబాకు చెందినవారిగా అయ్యారు. మొదట మనం పవిత్రముగా ఉండేవారమని, రాజ్య భాగ్యాన్ని పొందామని, ఇప్పుడు 84 జన్మలూ పూర్తయ్యాయని మీకు తెలుసు. దుఃఖితులుగా అయ్యారు కావుననే తండ్రిని స్మృతి చేస్తారు. ఈ వస్త్రాన్ని (శరీరాన్ని) ధరిస్తూ, ధరిస్తూ ఇప్పుడు తమోప్రధానముగా అయిపోయారు. మొదట ఆత్మ మరియు శరీరము - రెండూ సతోప్రధానముగా ఉండేవి. తర్వాత ఆత్మ సతో, రజో, తమోలలోకి వస్తుంది. మొదట బంగారముగా ఉండేది, ఆ తర్వాత వెండి, రాగి, ఇనుములలోకి వచ్చారు. దీనిని నగ అని కూడా అంటారు. బంగారములో లోహాలను కలుపుతారు కదా. తండ్రి అర్థం చేయిస్తారు, ఇప్పుడు ఆత్మలైన మీరు పతితులుగా అయిపోయారు. బంగారం నల్లగా అయిపోయింది. మీరు నల్లగా, అపవిత్రముగా అయిపోయారు. మొదట ఆత్మ అయిన మీరు పవిత్రముగా ఉండేవారు, శరీరము కూడా పవిత్రముగా ఉండేది, ఇప్పుడు మళ్ళీ పవిత్రమైన శరీరాన్ని ఎలా తీసుకుంటారు? స్నానం చేయడం ద్వారా తీసుకుంటారా? స్నానం చేయడం ద్వారా ఏమీ జరుగదు. ఆత్మ - హే పతిత పావన బాబా అని పిలుస్తుంది. 'బాబా' అన్న పదము ఎంత మధురమైనది! చాలా బాగుంటుంది. భారత్ లోనే 'బాబా' అన్న పదము ఉంది. పిల్లలు 'బాబా, బాబా' అని అంటూ ఉంటారు. మనం ఆత్మాభిమానులుగా అయి తండ్రికి చెందినవారిగా అయ్యామని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. తండ్రి అంటారు, నేను మొట్టమొదట మిమ్మల్ని స్వర్గములోకి పంపించాను. పాత్రను అభినయిస్తూ, అభినయిస్తూ ఇప్పుడు ఇక అంతిమంలోకి వచ్చి చేరుకున్నారు. లోలోపల ఎల్లప్పుడూ బాబా, బాబా అని అంటూ ఉండండి. బాబా వచ్చి ఉన్నారని పిల్లలైన మీకు తెలుసు. అందరూ వారినే - హే పతిత పావన బాబా రండి, వచ్చి పతితులైన మమ్మల్ని పావనంగా తయారుచేయండి అని పిలుస్తూ ఉంటారు. అందరూ తమ-తమ భాషలలో పిలుస్తూ ఉంటారు. ఎప్పుడైతే ప్రపంచం పాతబడుతుందో అప్పుడు పిలుస్తారు. కావున తప్పకుండా సంగమములోనే వస్తారు. ఇది కూడా మీకు తెలుసు. శాస్త్రాలలోనైతే బాగా కలగాపులగం చేసి వ్రాసేసారు. పిల్లలైన మీకు - మా బాబా అత్యంత ప్రియమైనవారు, అత్యంత లవ్లీ అని పక్కా నిశ్చయము ఉంది. బాబా కూడా, స్వీట్ చిల్డ్రన్ (మధురమైన పిల్లలూ) అని అంటారు. స్వీట్, స్వీటర్, స్వీటెస్ట్ (మధురము, అత్యంత మధురము, మధురాతి మధురము). ఇప్పుడు స్వీట్ ఎవరు? లౌకిక సంబంధములో కూడా తండ్రియే స్వీట్ గా ఉంటారు. ఆ తర్వాత స్వీటెస్ట్ అని టీచర్ ను అంటారు. టీచర్ చాలా మంచివారు. ఎంతైనా

చదివిస్తారు. జ్ఞానము సంపాదనకు ఆధారము అని అంటారు కూడా. అలాగే ఈ జ్ఞానము కూడా సంపాదనకు ఆధారము.

యోగాన్ని స్మృతి అని, జ్ఞానాన్ని నాలెడ్జ్ అని అంటారు. మిమ్మల్ని స్వర్గానికి అధిపతులుగా తయారుచేసాను అని పిల్లలైన మీకు తెలుసు. అందుకే శివజయంతిని జరుపుకుంటారు. కానీ శివబాబా ఎలా వచ్చారు - ఇది ఎవ్వరికీ తెలియదు. చిత్రాలలో త్రిమూర్తి ఉన్నారు, శివుడు పైన ఉన్నారు. బ్రహ్మా ద్వారా స్థాపన. స్థాపనను ఎవరు చేయిస్తారు? చేసేవారు మరియు చేయించేవారు శివబాబా. బ్రహ్మా, విష్ణు, శంకరుల పైన శివుడు ఉంటారు. వారు రచన. వారి రచయిత శివుడు. వారు నిరాకారుడు. ఇది సాకార సృష్టి. ఇది సృష్టి చక్రము, పునరావృతమవుతూ ఉంటుంది. సూక్ష్మవతనాన్ని సృష్టి చక్రము అని అనరు. ఈ మనుష్య సృష్టియే చక్రము వలె తిరుగుతూ ఉంటుంది. అంతేకానీ సూక్ష్మవతనములో కానీ, మూలవతనములో కానీ చక్రము విషయం లేదు. ఇప్పుడు ఇది కలియుగము, నరకము. సత్యయుగము స్వర్గము. ఇప్పుడు నరకవాసులను స్వర్గవాసులుగా ఎవరు తయారుచేయాలి? వామ మార్గములోకి వెళ్ళడం వల్లనే పతితులుగా అయిపోతారు. రోజురోజుకు సుఖము నుండి దుఃఖములోకి వస్తూ ఉంటారు. ప్రపంచం తమోప్రధానముగా అయిపోతుంది, అందుకే - వీరు పూర్తిగా తమోగుణీ బుద్ధి కలవారు అని అంటారు, వీరు ఎంతో సతోప్రధానమైన బుద్ధి కలవారు, దేవతా సమానమైనవారు అని అంటారు. వాస్తవానికి పూజ దేవతలకే జరగాలి. కానీ ఈ సమయంలో దేవతలు ఎవరూ లేరు ఎందుకంటే ఎవరిలోనూ దైవీ గుణాలు లేవు. క్రిస్టియన్లకు క్రైస్టు గురించి తెలుసు, వారిని పూజిస్తారు. భారతవాసులు స్వయాన్ని దేవీ-దేవతలుగా పిలుచుకోలేరు. ఫలానా దేవీ, ఫలానా దేవత అన్న పేర్లు ఎందరికో ఉన్నాయి, కానీ ఆ గుణాలైతే లేవు. నిర్గుణుడినైన నాలో ఏ గుణము లేదు అని పాడుతారు కూడా. ఆత్మ ఈ విధంగా ఎవరి ఎదురుగా అంటుంది? తండ్రి ఎదురుగా అనాలి కదా. తండ్రిని మరచి సోదరుల వెనుక పడుతూ ఉంటారు. బ్రహ్మా, విష్ణు, శంకరులు కూడా సోదరులే కదా. వారి ద్వారా ఏమీ లభించేది లేదు. సోదరుల పూజను చేస్తూ ఉంటారు, కిందకు దిగజారుతూ ఉంటారు. ఇప్పుడు మీకైతే తండ్రి నుండి వారసత్వము లభిస్తుంది. తండ్రి గురించి ఎవరికీ తెలియదు. తండ్రిని సర్వవ్యాపి అని అనేస్తారు. అరే, తండ్రి పేరు ఏమిటి? వారు నామ-రూపాలకు అతీతుడు అని అనేస్తారు. అరే, ఒక వైపు మీరు తండ్రిని అఖండ జ్యోతి స్వరూపుడు అని అంటున్నారు, మరి వారు అతీతుడు అని ఎలా అంటారు? నియమానుసారముగా అందరూ తమోప్రధానముగా అవ్వవలసిందే అని కూడా అర్థం చేసుకుంటారు. మళ్ళీ ఎప్పుడైతే తండ్రి వస్తారో, అప్పుడు అందరినీ సతోప్రధానముగా తయారుచేస్తారు. ఆత్మ తప్పకుండా పవిత్రముగా అవ్వాలి. ఆత్మలందరూ తండ్రితోపాటు నివసించేవారు. కొత్త ప్రపంచము పాత ప్రపంచముగా అవ్వవలసిందే.

ఇప్పుడు మనం బాబాకు చెందినవారిగా అయ్యామని మీకు తెలుసు. బాబా వచ్చి ఉన్నారు. బ్రహ్మా ద్వారా స్థాపన చేయిస్తారు. తండ్రి అంటారు, నేను బ్రహ్మా తనువును ఆధారముగా తీసుకుంటాను. భాగ్యశాలీ రథముపై స్వారీ చేస్తాను. రథములో తప్పకుండా ఆత్మ అయితే ఉంటుంది కదా. భగీరథుడు గంగను తీసుకువచ్చారు అని అంటారు. కానీ గంగ జటాజూటము నుండి ఎలా వస్తుంది? ఆ తీయని నీరు అనేది పర్వతాల నుండి వస్తుంది. సముద్రము నుండి మేఘాలు నీరు నింపుకొని ఆ తర్వాత కురుస్తాయి. ఈ రోజుల్లో సైన్స్ శక్తితో నీటిని తీయగా చేస్తారు. న్యాచురల్ మేఘాలు ఎంతగా కురుస్తూ ఉంటాయి, ఎంత నీరు వస్తుంది, దాని వలన వరదలు వచ్చేస్తాయి. ఇంతటి నీరు ఎక్కడి నుండి వస్తుంది? దానిని మేఘాలే సముద్రము నుండి నింపుకుంటాయి. అంతేకానీ ఇంద్రుడు మొదలైనవారు ఎవరూ లేరు. మేఘాలు నీరును నింపుకొని వర్షిస్తాయి. వాస్తవానికి ఇది జ్ఞానమనే వర్షము. ఇది నాలెడ్జ్ కదా. దీని ద్వారా ఏమి జరుగుతుంది? పతితుల నుండి పావనులుగా అవుతారు. గంగ, యమున నదులు సత్యయుగములో కూడా ఉంటాయి. శ్రీకృష్ణుడు అక్కడ ఆట, పాటలు మొదలైనవి చేసేవారు అని అంటారు. వాస్తవానికి అటువంటి విషయమేమీ లేదు. అక్కడ శ్రీకృష్ణుడిని ఎంతగానో సంభాళిస్తూ పాలన చేస్తారు. వారు చాలా మంచి పుష్పం కదా. పుష్పాలు ఎంత ప్రియమనిపిస్తాయి. పుష్పాల నుండే సుగంధాన్ని తీసుకుంటారు. ముళ్ళ నుండి ఎప్పుడైనా సుగంధాన్ని తీసుకుంటారా? ఇది ఉన్నదే ముళ్ళ అడవి. నిరాకారుడైన తండ్రి అంటారు, నేను వచ్చి పూలతోటను తయారుచేస్తాను, అందుకే బబుల్ నాథ్ అన్న పేరును కూడా పెడతారు. తుమ్మముళ్ళలాంటివారిని పుష్పాలుగా తయారుచేస్తారు, అందుకే ముళ్ళను పుష్పాలుగా తయారుచేసే నాథుడు అని మహిమ చేయడం జరుగుతుంది. కావున బాబా పట్ల ఎంత ప్రేమ ఉండాలి. లౌకిక తండ్రి ఉన్నా కూడా ఆత్మ పారలౌకిక తండ్రిని స్మృతి చేస్తుంది, ఎందుకంటే దుఃఖితముగా ఉంది. ఇది కూడా ఒక ఆటయే. మీరు అర్ధకల్పం నుండి స్మృతి చేస్తూ వచ్చారు. వారు వస్తారు, అందుకే శివజయంతిని జరుపుకుంటారు. మనం అనంతమైన తండ్రికి పిల్లలుగా అయ్యామని మీకు తెలుసు. మన సంబంధం వారితో కూడా ఉంది, లౌకిక తండ్రితో కూడా ఉంది. అనంతమైన తండ్రి అంటారు, నన్ను స్మృతి చేయడం ద్వారా మీరు పావనులుగా

అవుతారు. వీరు లౌకిక తండ్రి అని, వారు పారలౌకిక తండ్రి అని ఆత్మకు తెలుసు. ఆత్మ పారలౌకిక తండ్రినే పిలుస్తుంది. ఓ భగవంతుడా, ఓ గాడ్ ఫాదర్, అని ఆత్మ అంటుంది. ఫాదర్ ఇంట్లోనే కూర్చున్నప్పుడు మరి ఓ ఫాదర్ అంటూ ఎందుకు పిలుస్తున్నారు? ఆత్మ ఆ అవినాశీ తండ్రిని తలచుకుంటుంది. వారు ఎప్పుడు వచ్చి కొత్త ప్రపంచాన్ని రచిస్తారు - ఇది కూడా మీరు ఇప్పుడు అర్థం చేసుకుంటారు. తప్పకుండా కలియుగ అంతిమం మరియు సత్యయుగ ఆది యొక్క సంగమములో వస్తారు అని అంటారు. కలియుగ ఆయువును లక్షల సంవత్సరాలు అని అనేస్తారు. మనుష్యులు భగవంతుడిని పొందేందుకు ఎంతగా భ్రమిస్తారు. అందరికన్నా ఎక్కువ భక్తి ఎవరు చేస్తారు? మొదట వారికే లభించాలి కదా. బాబా అర్థం చేయిస్తారు, మొట్టమొదట భక్తిని మీరే ప్రారంభిస్తారు, కావున మీకే మొట్టమొదట జ్ఞానం లభించాలి. మీరు మొదట అసురీ గుణాలు కలవారిగా ఉండేవారు. ఇప్పుడు మీరు దైవీ గుణవంతులైన దేవతలుగా అవుతారు. ఇంత ఉన్నతమైన స్వర్గానికి మీరు యజమానులుగా అవుతారు. అక్కడి ప్రతి వస్తువూ ఫస్ట్ క్లాస్ గా ఉంటుంది. మీరు చాలా గొప్ప వ్యక్తులుగా అవుతారు. మీ కొరకు అక్కడ వజ్ర-వైఢూర్యాల మహళ్ళు తయారవుతాయి.

ఎప్పటివరకైతే బ్రాహ్మణులుగా అవ్వరో, అప్పటివరకూ శివబాబా నుండి వారసత్వము లభించదు. శూద్రులు వారసత్వాన్ని తీసుకోలేరు. ఇది యజ్ఞము కదా. ఇందులో బ్రాహ్మణులు తప్పకుండా కావాలి. యజ్ఞం ఎల్లప్పుడూ బ్రాహ్మణుల ద్వారానే జరుగుతుంది. శివుడిని రుద్రుడు అని కూడా అంటారు. ఇది రుద్ర జ్ఞాన యజ్ఞము. రుద్రుడైన శివబాబా ఈ జ్ఞాన యజ్ఞాన్ని రచించారు. భక్తి పూర్తయినప్పుడు ఈ యజ్ఞాన్ని రచించడం జరుగుతుంది. మనుష్యులు భక్తి మార్గములో యజ్ఞాలను రచిస్తారు. సత్యయుగములో దేవతలు ఎప్పుడూ ఈ యజ్ఞాలు మొదలైనవాటిని రచించరు. కానీ ఇది రాజస్వ అశ్వమేధ అవినాశీ రుద్ర జ్ఞాన యజ్ఞము. ఈ పేరుతో శాస్త్రాలలో కూడా గాయనము ఉంది. భక్తి మరియు జ్ఞానము, రెండూ సగం-సగం ఉంటాయి. భక్తి రాత్రి, జ్ఞానము పగలు. ఈ విధంగా బాబా అర్థం చేయిస్తారు. ఎల్లప్పుడూ బాబా, బాబా అని అంటూ ఉండండి. బాబా మనల్ని విశ్వానికి అధిపతులుగా తయారుచేయనున్నారు. వీరు అతి ప్రియమైన బాబా. వీరికన్నా ఎక్కువ ప్రియమైనవారు ప్రపంచములో ఇంకెవ్వరూ ఉండలేరు. అర్ధకల్పం తండ్రిని స్మృతి చేసారు. ఆ తండ్రికి చెందినవారిగా మనం అయ్యామని ఇప్పుడు మీకు తెలుసు. తండ్రి అంటారు, గృహస్థ వ్యవహారములో ఉంటూ తండ్రిని స్మృతి చేయండి. అందరూ ఇక్కడ ఉండలేరు. అయితే, ఆ బాబా దగ్గర ఉండగలరు. ఎక్కడ? ఏ బాబా? వారి పేరేమిటి? శివబాబా వద్ద ఎక్కడ ఉంటారు? పరంధామంలో. అక్కడ ఆత్మలందరూ ఉండగలరు, ఇక్కడ ఉండలేరు. ఇక్కడైతే కొద్దిమందే ఉంటారు. ఇక్కడ పిల్లలైన మీరు జ్ఞానాన్ని తీసుకోవాలి. ఇది చదువు కదా.

ఎవరైనా కలిసినప్పుడు వారికి చెప్పాలి - ఇద్దరు తండ్రులు ఉన్నారు, లౌకికము మరొకరు పారలౌకికము. దుఃఖములో పారలౌకిక తండ్రినే స్మృతి చేస్తారు. ఆ తండ్రి ఇప్పుడు వచ్చి ఉన్నారు. అత్యంత ప్రియమైనవారు శివబాబాయే. శ్రీకృష్ణుడు కూడా అందరికీ అత్యంత ప్రియమైనవారు. కానీ శివబాబా నిరాకారుడు మరియు శ్రీకృష్ణుడు సాకారుడు. శ్రీకృష్ణుడిని అందరి తండ్రి అని అనరు. వారు విశ్వానికి అధిపతి. వారిని కూడా ఆ విధంగా తయారుచేసేవారు శివుడే. ఇరువురూ ప్రియమైనవారు. కానీ ఆ ఇరువురిలోనూ ఎక్కువ ప్రియమైనవారు ఎవరు? శివుడు అని చెప్తారు. శివుడే శ్రీకృష్ణుడిని ఆ విధంగా తయారుచేస్తారు. మరి శ్రీకృష్ణుడేమి చేస్తారు? ఏమీ చేయరు. తమోప్రధాన ఆత్మలను తండ్రియే వచ్చి సతోప్రధానముగా తయారుచేస్తారు. కావున గాయనము వారికే జరుగుతుంది కదా. శ్రీకృష్ణుడైతే చిన్న బాలుడు, అతని నాట్యము మొదలైనవాటిని చూపిస్తారు. శివబాబా ఏమి నాట్యము చేస్తారు? తండ్రి అర్థం చేయిస్తున్నారు, మీరంతా పార్వతులు, అమరనాథుడైన శివుడు మీకు కథను వినిపిస్తున్నారు. వేరే పార్వతి అంటూ ఎవరూ లేరు. అర్జునుడు కూడా ఒక్కరే లేరు, మీరందరూ అర్జునులే. ద్రౌపదులు కూడా మీరందరే. ఎవరైతే వివస్త్రగా చేస్తారో, వారు దుశ్శాసనులు. అందుకే బాబా, మమ్మల్ని రక్షించండి అని పిలుస్తారు. బాబా అంటారు - పిల్లలూ, వివస్త్రగా ఎప్పుడూ అవ్వకండి. ఎప్పుడైతే ద్రౌపదిని వివస్త్రగా చేసేందుకు ప్రయత్నించారో, అప్పుడు శ్రీకృష్ణుడు ఆమెకు 21 చీరలను ఇచ్చినట్లుగా చూపిస్తారు కదా. ఇప్పుడు 21 చీరలు ధరించడం జరుగుతుందా? ఇది కూడా ఒక ఆటగా చూపిస్తారు. శ్రీకృష్ణుడు పై నుండి చీరలను ఇస్తూ ఉన్నట్లు చూపిస్తారు. ఇప్పుడు 21 చీరలను ఎలా ధరించగలరు? వాస్తవానికి అర్థమేమిటంటే తండ్రి వివస్త్రగా అవ్వడం నుండి ఎలా రక్షిస్తారంటే, తద్వారా మీరు 21 జన్మలు ఎప్పుడూ వివస్త్రగా అవ్వరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన స్వీట్ చిల్డ్రన్ కు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లోలోపల బాబా-బాబా అని అంటూ బాబా సమానముగా మధురముగా అవ్వాలి. ఆత్మాభిమానులుగా ఉండాలి. చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టాలి.

2. అత్యంత ప్రియమైన తండ్రిని స్మృతి చేస్తూ పావనముగా తప్పకుండా అవ్వాలి. స్మృతి అనే అగ్ని ద్వారా వికారాల రూపీ మాలిన్యాన్ని తొలగించి సత్యమైన బంగారముగా అవ్వాలి.

వరదానము:- పర్వతములాంటి విషయాన్ని కూడా ఒక్క బాబా అనే పదము యొక్క స్మృతి ద్వారా దూదిపింజంలా చేసే సహజయోగీ భవ

సహజయోగిగా అయ్యేందుకు ఒక్క పదాన్ని గుర్తు ఉంచుకోండి - ''నా బాబా'', అంతే. ఏ విషయము వచ్చినా, హిమాలయ పర్వతము కన్నా పెద్దదైనా, కానీ బాబా అని అనగానే పర్వతము దూదిపింజంలా అయిపోతుంది. ఆవగింజ అన్నా కొంచెము దృఢంగా, గట్టిగా ఉంటుంది, దూదిపింజం అయితే మెత్తగా మరియు తేలికగా ఉంటుంది. ఎంతటి పెద్ద విషయమైనా కానీ దూదిపింజం సమానంగా తేలికగా అయిపోతుంది. ప్రపంచములోనివారు చూస్తే - ఇది ఎలా అవుతుంది అని అంటారు మరియు మీరేమో - ఇది ఇలా అవుతుంది అని అంటారు. బాబా అని అనగానే బుద్ధిలో - ఇలా చెయ్యండి అని టచ్ అవుతుంది, అప్పుడు సహజమైపోతుంది. ఇదే సహజయోగీ జీవితము.

స్లోగన్:- ప్రేమ సాగరునిలో లవలీనమై ఉన్నట్లయితే సదా సమీప, సమాన మరియు సంపన్న భవ యొక్క వరదానీలుగా అవుతారు.